www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 8 ఏప్రిల్ 2024
5
ఏలూరు



పోలీసుల కవాతు

ప్రజాశక్తి - కుక్కునూరు

రానున్న ఎన్నికల సందర్భంగా మండలంలోని దాచారం, నెమలి పేటల్లో ఆదివారం పోలీసుల కవాత్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ, పోలవరం రిటర్నింగ్ అధికారి ఎం.సూర్య తేజ పాల్గొని మాట్లాడుతూ రానున్న ఎన్నికల నేపథ్యంలో ఓటర్లలో ఎలాంటి భయాందోళనకు తావు లేకుండా చేయడంలో భాగంగా పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలు కవాతు ద్వారా ప్రజలందరికీ ఎన్నికల పట్ల భద్రత, భరోసా కల్పిస్తున్నారన్నారు. ముఖ్యంగా సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి ఆయా ప్రాంతాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎన్నికలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా, పారదర్శకంగా ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు పోలీసు సిబ్బందితో పాటు కేంద్ర సాయుధ బలగాలు కలిసి విధులు నిర్వర్తిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

బస్టాండ్లలో నిలువు దోపిడీ..!



ఆర్‌టిసి బస్టాండ్లలో ధరల దోపిడీ విచ్చలవిడిగా సాగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా తినుబండారాలు, తాగునీరు, శీతల పానీయాల అమ్మకాలు సాగుతున్నా పట్టించుకునే నాధుడే లేకుండాపోయాడు. దీంతో ప్రయాణికులు నిలువు దోపిడీకి గురవుతున్నారు.

తినుబండారాలు, తాగునీరు, శీతల పానీయాలు అధిక ధరకు విక్రయం

రెండు జిల్లాల్లోనూ అమలుకాని ఎంఆర్‌పి

రూ.20 బిస్కెట్ ప్యాకెట్ రూ.25కు విక్రయం, మిగిలిన వస్తువులు అదే రీతి

ప్రయాణికులు ప్రశ్నిస్తే వస్తువులు విక్రయించకుండా ఇబ్బందులు

తణుకు బస్టాండ్‌లో పరిస్థితి మరింత దారుణం పట్టించుకోని ఆర్‌టిసి అధికారులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో పెద్ద బస్టాండ్లు ఏడు వరకూ ఉన్నాయి. రెండు జిల్లాల్లో దాదాపు 600కు వరకూ ఆర్‌టిసి బస్సులు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తుంటాయి. నిత్యం వేలాది మంది ప్రయాణికులు ఆర్‌టిసి బస్సుల్లో తమ ప్రయాణం సాగిస్తున్నారు. బస్టాండ్లలో తినుబండారాలు, తాగునీరు, శీతల పానీయాలు విక్రయించేందుకు షాపుల ఏర్పాటు ఆర్‌టిసి నిబంధనలకు అనుగుణంగా సాగుతోంది. నిబంధనల ప్రకారం ఆర్‌టిసి బస్టాండ్లలో దుకాణాల్లో వస్తువుల ధరలన్నీ ఎంఆర్‌పికి లోబడే ఉంచి విక్రయించాలనే నిబంధన ఉంది. అయితే ఇది ఎక్కడా అమలు కావడం లేదు. చాలా బస్టాండ్లలో అధిక ధరలకు తినుబండారాలు, తాగునీరు, కూల్‌డ్రింక్స్ విక్రయిస్తూ ప్రయాణికుల నుంచి దోచేస్తున్న పరిస్థితి ఉంది. రూ.20 బిస్కెట్ ప్యాకెట్ రూ.25కు విక్రయిస్తున్నారు. కూల్‌డ్రింక్, తాగునీరు బాటిల్స్ సైతం అదనంగా రూ.ఐదు వరకూ అమ్మకాలు సాగిస్తున్నారు. ఇదంతా బహిరంగంగానే జరుగుతున్నా ఆర్‌టిసి అధికారులు పట్టించుకోకపోవడం అందరినీ విస్మయానికి గురి చేస్తోంది. పశ్చిమగోదావరి జిల్లా తణుకు బస్టాండ్‌లో పరిస్థితి మరింత దారుణంగా మారింది. అధిక ధరలకు విక్రయంపై ప్రశ్నించిన ప్రయాణికులకు వస్తువులు అమ్మకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. గట్టిగా మాట్లాడితే మీకు ఎంఆర్‌పికి కావాలంటే క్యాష్ ఇవ్వాలని, ఫోన్ పే వంటివి కుదరదంటూ షరతులు పెడుతూ ఇబ్బంది పెడుతున్నారు. ప్రస్తుతం వేసవికాలం కావడంతో ప్రయాణికులు వాటర్ బాటిల్స్, కూల్‌డ్రింక్స్ ఎక్కువగా కొనుగోలు చేస్తుంటారు. వేసవిలో బిస్కెట్స్ వంటివి సైతం ప్రయాణికులు ఎక్కువగా కొనుగోలు చేస్తారు. ఒక్కో ప్యాకెట్‌కు రూ.ఐదు చొప్పున అధికంగా విక్రయించడంతో ప్రయాణికుల నుంచి భారీగా దోచేస్తున్న పరిస్థితి ఉంది. ఒక్కో ప్రయాణికుడు రెండు, మూడు వస్తువులు కొనుగోలు చేస్తే కనీసంగా రూ.15 వరకూ అదనంగా చెల్లించాల్సిన పరిస్థితి ఉంది. ఎంఆర్‌పికే విక్రయించాలని నిబంధన ఉన్నప్పటికీ బస్టాండ్లలోని షాపుల్లో ఈ విధంగా విక్రయించడం ఏమిటో ఏఒక్కరికీ అర్థం కావడం లేదు.

అధికారులు అక్కడే ఉన్నా.. అధిక ధరలే..!

ఆర్‌టిసి బస్టాండ్లలో సంబంధిత అధికారులు, డిపో మేనేజర్ అక్కడే ఉంటారు. అయినప్పటికీ యధేచ్ఛగా ఈ దోపిడీ సాగుతోంది. ఇంత జరుగుతున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదు. బస్టాండ్లలో దుకాణాలు నడుపుతున్న యజమానులకు, అధికారులకు మధ్య రహస్య ఒప్పందాలు ఏమైనా ఉన్నాయా అనే విమర్శలు వినిపిస్తున్నాయి. నిబంధనల ప్రకారం ప్రతి దుకాణం ముందు వస్తువుల ధరలకు సంబంధించి బోర్డులు ప్రదర్శించాల్సి ఉంది. ఎక్కడా అటువంటి పరిస్థితి లేకుండా పోయింది. దుకాణ దారులు ఎంత చెబితే అంత అన్నట్లు పరిస్థితి తయారైంది. దీనిపై ఆర్‌టిసి జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని, ప్రయాణికులను దోపిడీ నుంచి కాపాడాలని అంతా కోరుతున్నారు.

కొత్తూరు జ్యూట్‌మిల్లు క్లోజ్

నిన్నటి వరకూ లేఆఫ్.. నేడు మూత - నోటీసు బోర్డులో పెట్టిన యాజమాన్యం

రోడ్డున పడ్డ సుమారు 1200 మంది కార్మికులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



గత 28 సంవత్సరాలుగా నిరాటంకంగా నడుస్తున్న కొత్తూరు జ్యూట్‌మిల్లును సోమవారం నుంచి మూసివేస్తున్నట్లు యాజమాన్యం ఆదివారం నోటీసులివ్వడంతో 1200 మంది కార్మికుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. దీనిపై కార్మిక సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. జ్యూట్‌మిల్లు మూసివేత చట్ట విరుద్ధమని, మూసివేతకు యాజమాన్యాలు చెబుతున్న కారణం సహేతుకం కాదని, మిల్లు కొనసాగింపు, కార్మికుల హక్కుల కోసం పోరాడతామని హెచ్చరిస్తున్నాయి.

కృష్ణ హెసియన్స్ పేరుతో కొత్తూరు జ్యూట్‌మిల్ 1996లో ప్రారంభమైంది. వంద సంవత్సరాలుపైబడి చరిత్ర ఉన్న ఏలూరు జ్యూట్‌మిల్లు యాజమాన్యమే కొత్తూరులో దీనిని ప్రారంభించింది. ప్రారంభంలో మూడు వేల మంది కార్మికులు పని చేయగా క్రమంగా కార్మికుల సంఖ్య తగ్గుతూ నేడు 1235 మంది కార్మికులు పని చేస్తున్నారు. 2022 జనవరి 26న నష్టాల్లో ఉందనే సాకుతో ఏలూరు జ్యూట్‌మిల్లు మూసివేయడంతో సుమారు మూడు వేల మంది కార్మికులు రోడ్డున పడ్డ సంగతి తెలిసిందే. సంవత్సరకాలంగా కార్మిక సంఘాల పోరాటంతో రావాల్సిన నష్టపరిహారాన్ని కార్మికులు సాధించుకున్నారు. అయితే ఉపాధి కోల్పోవడంతో అనేక మంది తోపుడుబండ్లపై కూరగాయలు, పండ్లు వ్యాపారం చేస్తూ, కొంతమంది పెయింటర్లుగా, కొంతమంది కూలీలుగా మారి జీవనం సాగిస్తున్నారు. ఇదిలా ఉండగా కొత్తూరు జ్యూట్‌మిల్లు కూడా సంవత్సర కాలంగా తూతూమంత్రంగానే నడుస్తోంది. నష్టాల పేరుతో యాజమాన్యం కార్మికులకు పని కల్పించకుండా అతి కొద్ది మందికి మాత్రమే పని కల్పిస్తూ వస్తోంది. గత నెలలో నార కొరత ఉందంటూ, నార వచ్చిన వెంటనే మిల్లు కొనసాగిస్తామని.. అప్పటి వరకూ అంటే మార్చి 28వ తేదీ నుంచి ఏప్రిల్ ఏడో తేదీ వరకు లేఆఫ్ ప్రకటించారు. అంటే సగం జీతం కార్మికులకు ఇచ్చేలా యాజమాన్యం నోటీసులు జారీ చేసింది. ఆ నోటీసుల ప్రకారం ఏప్రిల్ 8న సోమవారం తిరిగి మిల్లు తెరవాల్సి ఉండగా ఎవరూ ఊహించని విధంగా ఒక రోజు ముందు ఆదివారం ముడి సరుకుకు పెట్టుబడి సమకూరలేదని, మిల్లు నష్టాల్లో ఉందని, ఈ పరిస్థితుల్లో మిల్లు నడపలేమని యాజమాన్యం కార్మిక సంఘాలకు, కార్మికులకు నోటీసులు పంపించింది. దీంతో కార్మికులు కంగుతిన్నారు. యాజమాన్యం చెబుతున్న కారణాలు సరికాదని, మిల్లు నష్టాల్లో ఉంటే ముందే కార్మికులకు ఎందుకు తెలియజేయలేదని కార్మిక సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. నిబంధనల ప్రకారం మిల్లు మూసివేయాలంటే మూడు నెలల ముందే ప్రభుత్వ అనుమతి తీసుకోవాలని, అలా తీసుకోకుండా మిల్లు మూసివేయడం చట్ట విరుద్ధమని చెబుతున్నారు. యాజమాన్యం మాత్రం కార్మికుల గైర్హాజరు వల్లే మిల్లు నష్టాల్లో ఉందని, కార్మికుల గైర్హాజరు వల్ల సామర్థ్యం మేరకు ఉత్పత్తి జరగడం లేదని, ఈ పరిస్థితుల్లో 2019 నుంచి మూడు షిఫ్టులు పని చేయాల్సిన కార్మికులను రెండు షిఫ్టులకే పరిమితం చేయాల్సి వచ్చిందని చెబుతోంది. 2022-23 సంవత్సరానికి రూ.ఏడు కోట్లు, 2023-24 సంవత్సరానికి రూ.17 కోట్లు నష్టం వచ్చిందని, నెలకు రూ.50 లక్షలు బ్యాంకు వడ్డీ కట్టాల్సి వస్తుందని, నార సరఫరా చేసే కంపెనీలకు కోట్లాది రూపాయలు బకాయి ఉండటంతో ముడిసరుకు వచ్చే పరిస్థితి ఏర్పడిందని, దీంతో మిల్లు తిప్పలేమని నోటీసులో పేర్కొంది. గత నెలలో లేఆఫ్ ప్రకటించినప్పుడే సిఐటియు, ఐఎఫ్‌టియు, టిఎన్‌టియుసి ఆధ్వర్యంలో కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ వద్ద సమావేశం నిర్వహించగా మిల్లు నష్టాల్లో ఉందని, పరిస్థితులు చక్కబడితే ఏప్రిల్ 8వ తేదీ నుంచి మిల్లు తిప్పుతామని యాజమాన్యం తెలిపింది. ఈ నేపథ్యంలో ఎనిమిదో తేదీ నుంచి తిరిగి మిల్లు తెలుసుకుంటుందని కార్మికులు ఎదురుచూస్తున్న తరుణంలో ఒక్కసారిగా యాజమాన్యం మిల్లు మూసివేస్తున్నట్లు ప్రకటించడంతో కార్మికుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఏలూరు జ్యూట్‌మిల్లును మూసివేసినప్పుడు కార్మికులు అనేక ఇబ్బందులు పడ్డారు. ఈ చేదు అనుభవం నుంచి బయటపడక ముందే కొత్తూరు జ్యూట్‌మిల్లు కూడా మూసివేయడం అన్యాయమని కార్మిక సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఈ విషయంలో కార్మికులకు న్యాయం జరిగే వరకూ పోరాడుతామని కార్మిక సంఘాల నేతలు ప్రకటించారు.

నష్టాల్లో ఉందని ఎన్నడూ చెప్పలేదు

కోలాపల్లి ఉమాశంకర్ (బుజ్జి), టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు, కొత్తూరు జ్యూట్‌మిల్లు గుర్తింపు సంఘం నేత

కొత్తూరు జ్యూట్‌మిల్లు యాజమాన్యం మిల్లు నష్టాల్లో ఉందని ఎన్నడూ కార్మికులకుగాని, యూనియన్ నేతలకుగాని తెలియజేయలేదు. ఇప్పుడు నష్టాల్లో ఉందని చెప్పడం సరికాదు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఆకస్మాత్తుగా జ్యూట్‌మిల్లు మూసివేసి కార్మికులను రోడ్డున పడేయటం చట్టవిరుద్ధం. దీనిపై మూడు సంఘాల నేతలు చర్చించుకుని కార్మికులకు న్యాయం జరిగే వరకూ పోరాడతాం. లేఆఫ్ ఇచ్చి, వెంటనే లాకౌట్ ప్రకటించడం చాలా దుర్మార్గం. మిల్లు నష్టాల్లో ఉందని ముందే మాకు తెలియజేసి ఉంటే కార్మికుల తరపున మేమే ప్రభుత్వానికి తెలియజేసేవాళ్లం. అలా చెప్పకుండా ఇప్పుడు ఒక్కసారే మూసివేస్తున్నామని చెప్పడం దుర్మార్గమైన చర్య. దీనికోసం చివరి వరకు పోరాడతాం. కార్మికులకు న్యాయం జరిగేలా చూస్తాం.

కొత్తూరు మిల్లు మూసివేత దారుణం

బద్దా వెంకట్రావు, ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి

కొత్తూరు జ్యూట్‌మిల్లు మూసివేత దారుణం. యాజమాన్య చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాం. కొంతకాలంగా కార్మికులకు పనులు లేకుండా చేసి ఒక పథకం ప్రకారం మిల్లును అక్రమంగా మూసివేస్తున్నారు. ఏలూరు మిల్లు మూసివేసిన నేపథ్యంలో రియల్ ఎస్టేట్ లాభాలు రుచి మరిగిన యాజమాన్యం కొత్తూరులో కూడా అదే పద్ధతిలో మూసివేసి కార్మికులను బజారున పడేసి లాభాలు పొందాలని చూస్తోంది. ఈ చర్యను ప్రభుత్వం ఆపాలని కోరుతున్నాం. దురుద్దేశంతో యాజమాన్యం మిల్లు మూసివేతకు పాల్పడుతున్నందున అందుకు అనుమతి ఇవ్వకుండా, మరెవరైనా మిల్లును తీసుకొని నడిపించేందుకు ఉన్న అవకాశాలను ప్రభుత్వం పరిశీలించాలి.

ప్రభుత్వ విధానాల ఫలితమే

వి.సాయిబాబు, పి.కిషోర్
కొత్తూరు జ్యూట్‌మిల్లు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు

కొత్తూరు జ్యూట్‌మిల్లు యాజమాన్యం అకస్మాత్తుగా మిల్లు మూసివేతున్నట్లు నోటీసు బోర్డు ద్వారా తెలియజేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. 2022లో ఇదేవిధంగా ఇదే యాజమాన్యం ఏలూరు జ్యూట్‌మిల్లు మూసివేసి ఐదువేల మంది కార్మికుల ఉపాధి దెబ్బతీసింది. నేడు కొత్తూరు జ్యూట్‌మిల్లు అక్రమ మూసివేతతో సుమారు 1250 మంది కార్మికుల ఉపాధి అగమ్యగోచరంగా మారుతోంది. ఇప్పటికే కొత్తూరు మిల్లులో సుమారు సంవత్సర కాలం నుండి కార్మికులకు పని చూపించకుండా యాజమాన్యం కుట్రపూరితంగా ఇప్పటివరకు వ్యవహరించింది. ఏదైనా కంపెనీ మూసివేయాలంటే ఆరు నెలలు ముందుగా కార్మికులకు సమాచారం తెలియజేయాలి. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చాక కార్మిక చట్టాలను లేబర్ కోడ్‌లుగా మార్చేయడంతో ప్రయివేటు యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయి. ఇప్పటికైనా తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకుని జ్యూట్ పరిశ్రమను ప్రభుత్వాలు నిలబెట్టి, ఆదుకోవాలి. కొత్తూరు జ్యూట్‌మిల్లును తెరిపించాలి. లేనిపక్షంలో ఇతర కార్మిక సంఘాలను, కార్మికులను కలుపుకుని ఆందోళన చేపడతాం.

బిజెపి, పొత్తు పార్టీలను ఓడించాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి, దానికి మద్దతు పలుకుతున్న పార్టీలను ఓడించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం స్థానిక సిపిఎం జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల జిల్లాస్థాయి సమావేశం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.కిషోర్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో రవి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి, దానికి మద్దతిస్తున్న పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు. బిజెపి ప్రభుత్వం గత పది సంవత్సరాలుగా ఇచ్చిన హామీలు అమలు చేయలేదని విమర్శించారు. నల్లధనం తీసి పేదల ఖాతాల్లో రూ.15 లక్షలు వేస్తామని చెప్పి వేయలేదన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోసగించిందని విమర్శించారు. రక్షణ, రైల్వే రంగాలతో సహా ప్రయివేటీకరణకూ వెనుకాడటం లేదన్నారు. నోట్ల రద్దు చేసి సామాన్య ప్రజలను ఇబ్బంది పెట్టిందని, పెట్రోల్, డీజిల్, గ్యాస్, కరెంట్ ఛార్జీలు పెంచి ప్రజల నడ్డి విరిచిందని తెలిపారు.



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి ఎ.రవి

లౌకిక రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా విద్యలో మూఢత్వ, మత నమ్మకాలు చొప్పిస్తుందని, ఢిల్లీ, కర్ణాటక, మణిపూర్ తదితర ప్రాంతాల్లో ముస్లిం, క్రైస్తవులపై దాడులు పెరిగేందుకు కారణమైందని విమర్శించారు. ఈసారి బిజెపి గెలిస్తే రాజ్యాంగాన్ని రద్దు చేస్తామని బహిరంగంగా ఆ పార్టీ ఎంపీలు చెప్పడం బిజెపి దుర్మార్గపూరిత వైఖరికి నిదర్శనమన్నారు. జమిలి ఎన్నికలు పేరుతో దేశంలో ప్రజాసామ్యాన్ని హరించి, అధ్యక్ష తరహా పాలన తీసుకొస్తారన్నారు. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలను కూలదోస్తూ, ప్రతిపక్ష పార్టీల నేతలను కేసుల్లో ఇరికించి జైళ్లకు పంపడం అప్రజాస్వామికమన్నారు. ఇతర పార్టీల్లోని అవినీతిపరులు బిజెపిలో చేరగానే నీతిపరులుగా మారడం వెనుక రహస్యం ఆ పార్టీ పెద్దలే చెప్పాలని ఎద్దేవా చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు, వెనుకబడిన ప్రాంతాలకు, రాజధాని నిర్మాణానికి నిధులు, విశాఖ రైల్వే జోన్, కడప ఉక్కు కర్మాగారం ఇలా ఏ హామీనీ అమలు చేయలేదన్నారు. రాష్ట్రంలో బిజెపి బ్లాక్‌మెయిల్‌కు లొంగి జనసేన, టిడిపి కలిసి కూటమిగా పోటీ చేస్తున్నాయన్నారు. లోపాయికారిగా వైసిపి అన్ని అంశాల్లో బిజెపికి మద్దతిస్తుందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో బిజెపి, దానికి మద్దతిస్తున్న పార్టీలను ఓడించాలన్నారు. చట్ట సభల్లోకి కమ్యూనిస్టు నేతలను పంపాలని, వామపక్ష, లౌకిక పార్టీలను గెలిపించాలని అని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్, ఆర్.లింగరాజు, జి.రాజు పాల్గొన్నారు.

ఆర్‌టిసి కార్గోలో డ్రై ఫ్రూట్స్ బాక్సుల్లో నగదు తరలింపు

పట్టుకున్న ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

ఎన్నికల ఖర్చులకో.. లేక నల్లధనమోగాని ఆ నగదు తరలింపు విధానం చూసి అధికారులతోపాటు అంతా ముక్కున వేలేసుకున్నారు. ఈ నగదును తరలిస్తున్న వారెవరూ.. దేని కోసం తరలిస్తున్నారు అనే అంశాలను తేల్చే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఎపిఎస్ ఆర్‌టిసి కార్గో వాహనం హైదరాబాద్ నుంచి జంగారెడ్డిగూడెం వస్తోంది. ఈ వాహనం పట్టణంలోకి ప్రవేశించి పాత పంచాయతీ కార్యాలయం వద్దకు వచ్చేసరికి ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు ఆ కార్గో వాహనాన్ని ఆపి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో నాలుగు డ్రై ఫ్రూట్స్ పెట్టెల్లో నగదు గుర్తించారు. ఆ నగదును లెక్కించగా రూ.22.63 లక్షలుగా నిర్ధారించి సీజ్ చేశారు. దీనిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని డిఎస్‌పి రవిచంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి రమణ, తదితరులు పాల్గొన్నారు.

మారుతీ బ్రీజా కారు నుంచి రూ.3.66 లక్షలు స్వాధీనం

ఏలూరు స్పోర్ట్స్: నగరంలోని తంగెళ్లమూడి సమీపంలో ఉన్న సమాధుల తోట వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్‌పోస్ట్ వద్ద నిర్వహించిన తనిఖీల్లో ఎటువంటి ఆధారం లేని రూ.3.66 లక్షలు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మారుతి బ్రీజా కారులో ఈ నగదును గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.



నగదు స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

తాగునీటి ఎద్దడి రాకుండా చెరువులు నింపాలి

పంచాయతీ విస్తరణాధికారి షంషుద్దీన్


ఉంగుటూరు: వేసవిలో డెల్టా గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చెరువును పూర్తిగా నింపేలా చర్యలు చేపట్టామని ఉంగుటూరు మండల పంచాయతీ విస్తరణాధికారి షేక్ షంషుద్దీన్ వెల్లడించారు. ఆదివారం ఆయన రావులపర్రులో చెరువు నింపే కార్యక్రమాన్ని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రామారావు, సిబ్బందితో కలసి పరిశీలించారు. తాగునీటి చెరువులతో పాటు పశువుల చెరువులను కూడా నింపుతున్నామన్నారు. కాగుపాడు-2, రావులపర్రు-2, రాచూరు-2, సీతారాంపురం-1, దొంతవరం-2, కాకర్లమూడి-3, విఎ పురం-2, బాదంపూడి-1, ఉప్పాకపాడు-2, బొమ్మిడి-2 చెరువులతో పాటు కైకరం-3, నారాయణపురం-1, చేబ్రోలు-1 ఇతర అవసరాల కోసం ఆయా చెరు వుల్లోకి ఆయిల్ ఇంజిన్ల ద్వారా గోదావరి జలాలను తోడిస్తున్నామన్నారు. ఈనెల 12లోపు అన్ని చెరువులూ సామర్థ్యానికి లోబడి నింపేలా పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. చెరువులు నింపేందుకు నిర్వహణ వ్యయాన్ని ఆయా పంచాయతీల నిధుల నుంచి వెచ్చించాల్సి ఉందన్నారు. ఈ మండలంలో ఇంతవరకూ ఎక్కడా నీటి సమస్యలు లేవని ఇఒపిఆర్‌డిఒ ప్రజాశక్తికి తెలిపారు.



చెరువులు నింపుతున్న సిబ్బంది

ఏలూరులో డిజె టిల్లు టీమ్ సందడి

ఏలూరు సిటీ: డిజె టిల్లు మూవీ రూ.100 కోట్లు సాధించిన సందర్భంగా ఏలూరు నగరంలోని విజయలక్ష్మి థియేటర్‌లో ఆదివారం చిత్ర యూనిట్ సక్సెస్ మీట్ ఏర్పాటు చేసింది. ఈ సక్సెస్ మీట్‌లో డైరెక్టర్ మల్లిక్ రామ్, హీరో సిద్దు జొన్నలగడ్డ, భీమ్స్ సిసిరోలియో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లిక్ రాం మాట్లాడుతూ డిజె టిల్లు సినిమా రూ.100 కోట్ల కలెక్షన్లు సాధించడం చాలా సంతోషంగా ఉందన్నారు. తరువాత హీరో సిద్దు మాట్లాడుతూ సినిమాను ఇంత సక్సెస్ చేసినందుకు ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు తెలిపారు.తనని ఏలూరు ప్రజలు ఇంతగా ఆదరిస్తున్నందుకు సంతోషంగా ఉందని అన్నారు.



మాట్లాడుతున్న చిత్ర బృందం

'ప్రజలు అప్రమత్తంగా ఉండాలి'

ముసునూరు: సార్వత్రిక ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నూజివీడు డిఎస్‌పి జి.లక్ష్మయ్య అన్నారు. ఆదివారం మండలంలోని రమణక్కపేట గ్రామంలో ముసునూరు ఎస్‌ఐ పి.వాసు ఆధ్వర్యంలో గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఉద్దేశపూర్వకంగా ఎవరూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని, ఎవరైనా అలాంటి చట్ట వ్యతిరేక పనులు చేసినట్లయితే చర్యలు చేపట్టాలని తెలిపారు.

ఓటుహక్కు వినియోగించుకోవాలి

జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



ఏలూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిఒక్కరూ నిర్భయంగా తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్ తెలిపారు. జిల్లాలో ఎన్నికలు విజయవంతంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలంతా తమ సహకారం అందించాలన్నారు. సాధారణ ఎన్నికల్లో భాగంగా మే 13 తేదిన జరిగే ఎన్నికల పోలింగ్ రోజు ప్రతి ఒక్క ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. జిల్లాలో ఉన్న 16.25 లక్షల ఓటర్లు తమ ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవడంపై జిల్లా వ్యాప్తంగా ఓటరు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. త్వరలో జరగబోయే ఎన్నికలు నిష్పక్షపాతంగా, సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. ఎన్నికలకు సంబంధించిన అంశాలపై చర్యల కోసం వాట్సాప్ మెసేజ్/ఫొటోల ద్వారా వాస్తవ సమాచారం ప్రజలకు అధికార యంత్రాంగానికి అందించాలని కోరారు. దీనికి వాట్సాప్ నెంబర్ 94910 41435 అందుబాటులో ఉంచామని, ప్రజలు దీన్ని వినియోగించుకోవాలని తెలిపారు. ఎన్నికల సమాచారం కోసం 1950 టోల్ ఫ్రీ నెంబరు కూడా ఏర్పాటు చేయడమైందని అన్నారు.

సర్వసభ్య సమావేశంలో జెడ్‌పిటిసికి అవమానం

వెనుతిరిగిన పల్నాటి బాబ్జీ

జంగారెడ్డిగూడెం టౌన్: వైసిపిలో ప్రోటోకాల్ లేనివారు స్టేజిపైన, ఉన్నవారు వేదిక ముందు కూర్చొని ఉన్నారని జంగారెడ్డిగూడెం జెడ్‌పిటిసి పల్నాటి బాబ్జిని వేదికపైకి ఆహ్వానించకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ సర్వసభ్య సమావేశం ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో వైసిపి జెడ్‌పిటిసి, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పల్నాటి బాబ్జి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన వైసిపి చింతలపూడి నియోజవర్గ ఎంఎల్‌ఎ అభ్యర్థి కంభం విజయ రాజు, ముఖ్య అతిథులను వేదికపైకి ఆహ్వానించి జెడ్‌పిటిసి పల్నాటి బాబ్జిని వేదికపైకి ఆహ్వానించకుండా అవమానించారని, కనీసం వైసిపి చింతలపూడి ఎంఎల్‌ఎ అభ్యర్థి వేదికపై ఉండి కూడా ఎదురుగా కూర్చున్న జెడ్‌పిటిసిని ఆహ్వానించకపోవడంతో అక్కడ నుంచి అసంతృప్తితో ఆయన వెనుతిరిగారు. పల్నాటి బాబ్జి వైసిపిలో ప్రధాన పాత్ర వహిస్తూ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడిగా ఉన్నారు. జెడ్‌పిటిసిగా ఉన్న ఒక ప్రజా ప్రతినిధిని అగౌరవపరచడంతో స్థానిక ఎంఎల్‌ఎ అభ్యర్థి విజయరాజుపై, ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులపై పల్నాటి బాబ్జి అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయజరాజు అయోమయ స్థితిలో ఉన్నాడని కొందరు విమర్శించారు.



సమావేశం మధ్యలో లేచి వెళ్లిపోతున్న బాబ్జి


తాగునీటిలో డ్రెయినేజీ నీరు..

ఉంగుటూరు: మండలంలోని నారాయణపురం వైఎస్ఆర్ కాలనీ ఏ - బ్లాక్‌లో తాగునీటి పైపు మార్గంలో మురుగునీరు కలిసిపోయింది. ఆదివారం సాయంత్రం పంచాయతీ సిబ్బంది నీళ్లు వదిలిన కొద్దిసేపటికే రంగు మారి దుర్వాసనతో పురుగులు వస్తున్నాయని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించేందుకు వెంటనే చర్యలు తీసుకున్నామని పంచాయతీ ఇఒపిఆర్‌డి షంషుద్దీన్ తెలిపారు.

కొనసాగిన 'పది' మూల్యాంకనం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

పదో తరగతి ప్రశ్నాపత్రాల మూల్యాంకనం ఆదివారం ఏడో రోజు 97.9 శాతానికి చేరుకుందని డిఇఒ ఎస్.అబ్రహం తెలిపారు. నగరంలోని సెయింట్ గ్జేవియర్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల ప్రశ్నాపత్రాల మూల్యాంకనం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు కొనసాగుతుందని డిఇఒ ఎస్.అబ్రహం తెలిపారు. 1019 మంది సిబ్బంది హాజరయ్యారని డిఇఒ వివరించారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న యుటిఎఫ్ నేతలు

యుటిఎఫ్ ఆధ్వర్యాన మజ్జిగ పంపిణీ

ఏలూరు అర్బన్: స్థానిక సెయింట్ గ్జేవియర్ హైస్కూల్‌లో జరుగుతున్న 'పది' ప్రశ్నాపత్రాల మూల్యాంకనం విధుల్లో ఉన్న ఉపాధ్యాయులకు వేసవి తీవ్రత దృష్ట్యా యుటిఎఫ్ ఆధ్వర్యాన ఆదివారం మజ్జిగ పంపిణీ చేశారు. వేసవి ఎండల తీవ్రత వల్ల జవాబు పత్రాలు దిద్దుతున్న ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ఈ నేపథ్యంలో వారికి ఉపశమనం కల్గించేందుకు మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ప్రారంభించామని, ఇది రెండు రోజులు కొనసాగుతుందని నేతలు తెలిపారు. ఆదివారం ఈ కేంద్రాన్ని ఏలూరు జిల్లా పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ శ్రీకాంత్, పెదవేగి ఎంఇఒ బుధవ్యాస్ ప్రారంభించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.సుభా షిణి, పూర్వపు రాష్ట్ర కార్యదర్శి పివి.నరసింహారావు, ఏలూరు జిల్లా అధ్యక్షులు షేక్ ముస్తఫాలీ, సహాధ్యక్షులు వి.కనకదుర్గ పాల్గొన్నారు.

లో ఓల్టేజీ సమస్య పరిష్కారం

ప్రజాశక్తి వార్తకు స్పందన

జంగారెడ్డిగూడెం టౌన్ : మండలంలోని లక్కవరం గ్రామంలో లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని ఈనెల 7న శనివారం లక్కవరం పవర్ స్టేషన్ దగ్గర గ్రామస్తులు నిరసన చేపట్టిన విషయం విధితమే. లో ఓల్టేజ్ సమస్యతో ఇబ్బందులను గుర్తుతెన్నామని గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సమస్యను 24 గంటలు గడవకముందే విద్యుత్ అధికారులు పరిష్కరించారు. ఈ సందర్భంగా లక్కవరం గ్రామ ప్రజలు ధన్యవాదాలు తెలిపారు. 25 కెపాసిటీ గల ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 63 కెపాసిటీ గల ట్రాన్స్‌ఫార్మర్లను కొత్తగా ఏర్పాటు చేయడం జరిగిందని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. 63 కెపాసిటీ గల ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడం వల్ల ఆ గ్రామానికి లో ఓల్టేజ్ సమస్య పరిష్కారం అయ్యిందని గ్రామస్తులు విద్యుత్ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు తప్పవు

ఎస్ఐ పి.వాసు

ముసునూరు: గ్రామాల్లో ఫంక్షన్ల పేరిట కోడిపందేలు నిర్వహించరాదని ముసునూరు ఎస్ఐ పి.వాసు అన్నారు. ఆదివారం మండలంలోని రమణక్కపేట గ్రామంలో దినం పేరిట కోడిపందేలు వేస్తుండగా ముసునూరు ఎస్ఐ తమ సిబ్బందితో కలిసి దాడి చేసి పట్టుకోవడం జరిగింది. వారి వద్ద నుంచి 20 కత్తులు, ఒక కోడిపుంజు, రూ.2 వేల నగదు, ఇద్దరు మనుషులను పట్టుకొన్నారు. ఎవరైనా సరే దినం పేరు చెప్పి, ఫంక్షన్ పేరు చెప్పి కోడిపందేలు వేస్తే వారిపై, వేయించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుని వారిపై రౌడీ షీట్స్ ఓపెన్ చేయడం జరుగుతుందని తెలిపారు.

నాటుసారా తయారు చేస్తే సమాచారం ఇవ్వండి

సిఐ ఎం.సుధాకర్

చింతలపూడి: ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే నాటుసారా తయారు చేసే వారి వివరాలను పోలీసువారికి తెలియజేస్తే సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని చింతలపూడి సిఐ ఎం.సుధాకర్ అన్నారు. చింతలపూడి మండలంలో జిల్లా ఎస్‌పి డి.మేరీ ప్రశాంతి, జంగారెడ్డిగూడెం డిఎస్‌పి యు.రవిచంద్ర ఆదేశాలపై ఏలూరు స్పెషల్ బ్రాంచి సిబ్బందితో కలిసి చింతలపూడి మండలం నాగిరెడ్డి గూడెం గ్రామంలో ఆదివారం తెల్లవారుజాము నుంచి కార్డిన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. 3,600 లీటర్ల సారా ఊటను పారబోసి, సారా బట్టీల వద్ద ఉన్న 50 లీటర్ల నాటు సారాను, సారా కాయడానికి ఉపయోగించిన పాత్రలను, 20 ద్విచక్ర వాహనాలను స్వాధీనం పరుచుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎం.కుటుంబరావు, సిబ్బంది పాల్గొన్నారు.

'టిడిపి, జనసేన అభ్యర్థులను గెలిపించాలి'

జంగారెడ్డిగూడెం టౌన్: టిడిపి, జనసేన కూటమి అభ్యర్థులు సొంగా రోషన్ కుమార్, పుట్టా మహేష్ యాదవ్‌లను గెలిపించాలని జంగారెడ్డిగూడెం టిడిపి కౌన్సిలర్ చెరుకూరి శ్రీధర్ కోరారు. ఆదివారం నుంచి చేపట్టిన 30 రోజుల పాదయాత్ర సందర్భంగా ఒకటో వార్డులో సూపర్ సిక్స్ పథకాలు ఓటర్లకి ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఆయన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ పాదయాత్రతో జంగారెడ్డిగూడెం పట్టణంలోని ఒకటో వార్డు, మార్కండేయ పురం, వెంకట రమణ టౌన్‌షిప్, బైపాస్, గడిచెర్ల రోడ్‌లో ఇంటింటికీ తిరిగి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ వైస్ ప్రెసిడెంట్ కొండేటి కిషోర్, అధికార ప్రతినిధి సుబ్రహ్మణ్యం, బాబీ, లక్ష్మణ్, వార్డు అధ్యక్షులు మాణిక్యాల వెంకటేశ్వరరావు, గుండా లక్ష్మి, గద్దె జస్వంత్, శివ పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్ పథకాలతో ప్రతిఒక్కరికీ మేలు'

ముసునూరు: టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలతో ప్రతిఒక్కరికీ మేలు చేకూరుతుందని రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దె రఘుబాబు అన్నారు. ఆదివారం మండలంలోని గుడిపాడు గ్రామంలో టిడిపి నూజివీడు నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థి కొలుసు పార్థసారథి ఆదేశాల మేరకు గుడిపాడు, గుళ్లపూడి గ్రామాల్లో టిడిపి యువ నాయకుల ఆధ్వర్యంలో సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించారు. కొల్లి గంగారావు, మందలపు ధర్మరాజు, మనిమిక్కు సుబ్బారావు, మండలపు బుజ్జి, పంద పాల్గొన్నారు.

ఏలూరును స్మార్ట్ సిటీగా మారుస్తా..

టిడిపి ఏలూరు ఎంపీ అభ్యర్థి మహేష్ కుమార్

ఏలూరు సిటీ: ఏలూరును స్మార్ట్ సిటీగా మారుస్తానని, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడం తన కల అని, తనని గెలిపిస్తే పోలవరం ప్రాజెక్టును తప్పకుండా పూర్తి చేస్తానని టిడిపి ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్ట మహేష్ అన్నారు. టిడిపి, జనసేన కూటమి ఆత్మీయ సమావేశం ఏలూరులోని టౌన్ మర్చంట్ క్లబ్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ ఆత్మీయ సమావేశంలో మహేష్ కుమార్ యాదవ్, టిడిపి ఏలూరు ఎంఎల్ఎ అభ్యర్థి బడేటి చంటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుట్ట మహేష్ మాట్లాడుతూ ఏలూరుని అభివృద్ధి పథంలో నడిపిస్తానని అన్నారు. ఎటువంటి అభివృద్ధి చేయకుండా జగన్ ఈ ఐదేళ్ల కాలయాపన చేశాడని తెలిపారు. కూటమి విజయానికి అందరూ పెద్దన్న పాత్ర పోషించాలని కోరారు. ఈ సమావేశంలో టిడిపి అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, మధ్యాహ్నపు బలరాం, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాలు – ఘోరాలు

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ఏలూరు స్పోర్ట్స్: రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన భీమడోలు రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. ఏలూరు రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భీమడోలు రైల్వే స్టేషన్ సమీపంలోని ఫ్లైఓవర్ వద్ద గుర్తుతెలియని(25–30) ఏళ్ల వయసు గలిగిన వ్యక్తి రైలు ప్రమాదంలో మృతి చెందాడు. అయితే అతను రైలు నుంచి జారిపడి మృతి చెందాడ, రైలు ఢీకొని మృతి చెందాడ అని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతి చెందిన వ్యక్తి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ నంబూరి ఆదినారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు.

కాలువలో పడి వ్యక్తి మృతి

భీమడోలు: పూళ్ళ గ్రామం వద్ద ఏలూరు కాలువలో స్నానానికి దిగి ప్రమాదవశాత్తు వ్యక్తి ఆదివారం సాయంత్రం మృతి చెందారు. భీమడోలు పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన రంభా యేసు(45) కాలువలో స్నానానికి దిగి ప్రమాదవశాత్తు మునిగి చనిపోయారు. సమాచారం అందుకొన్న భీమడోలు అగ్నిమాపక కేంద్రం అధికారి నాగరాజు ఆధ్వర్యంలోని బృందం స్థానికుల సహకారంతో కాలువలో రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించి శవాన్ని వెలికి తీశారు. దీనిపై భీమడోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమతి లేని నాటు తుపాకీ స్వాధీనం

ముదినేపల్లి: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయా సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఎస్‌పి డి.మేరీ ప్రశాంతి ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం ముదినేపల్లి మండలంలో పోలీస్ అధికారులు పెట్రోలింగ్ నిర్వహించారు. డిఎస్‌పి ఇ.శ్రీనివాసులు, కైకలూరు రూరల్ ఇన్‌స్పెక్టర్ బి.కృష్ణ కుమార్, ముదినేపల్లి ఎస్ఐ డి.వెంకట్ కుమార్ సిబ్బందితో కలిసి ఈడేపల్లి గ్రామం వద్ద తమిళనాడు రాష్ట్రానికి చెందిన వెంకటేషన్ శబరి తండ్రి వెంకటేషన్ ఎటువంటి అనుమతులు లేని నాటు తుపాకిని కలిగి ఉన్నాడు. రొయ్యల చేరువులపై పిట్టలను బెదరేస్తున్నాడు. వెంకటేషన్ శబరిను అదుపులోకి తీసుకోని ముద్దాయి వద్ద ఉన్న నాటు తుపాకిని స్వాధీనపరుచుకొని కేసు నమోదు చేశారు.

అమ్మవారి తాళిబొట్లు అపహరణ

ఏలూరు స్పోర్ట్స్: పట్టపగలు గుర్తుతెలియని వ్యక్తి అమ్మవారి గుడిలోకి ప్రవేశించి అమ్మవారి తాళిబొట్టును దొంగిలించుకుపోయిన ఘటన ఏలూరు నగరంలో చోటుచేసుకుంది. ఏలూరు మూడో పట్టణ సిఐ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు నగరంలోని సత్రంపాడు సమీపంలో సౌభాగ్య లక్ష్మి అమ్మవారి ఆలయంలో ఆదివారం ఉదయం దాదాపు 7:30 ప్రాంతంలో గుర్తు తెలియని అగంతకుడు గుడిలోకి ప్రవేశించి గర్భగుడిలో ఉన్న అమ్మవారి విగ్రహం మెడలో ఉన్న బంగారు తాళిబొట్టును అపహరించుకుపోయాడు. సీసీ కెమెరాలో రికార్డ్ అయిన దాని ప్రకారం పోలీసులు పరిశీలించి నిందితుడిని వెంటనే గుర్తించి అదుపులోకి తీసుకుంటామని సిఐ వెంకటేశ్వర రావు ఒక ప్రకటనలో తెలిపారు.

సమయపాలన పాటించని పంచాయతీ కార్యదర్శులు

కొరవడిన పర్యవేక్షణ

ప్రజలకు తప్పని ఇబ్బందులు

ప్రజాశక్తి – ముదినేపల్లి

మండలంలోని పలు గ్రామాల కార్యదర్శులు సమయపాలన పాటించడం లేదు. ఉదయం 10:30 గంటలకు విధులకు హాజరు కావాల్సి ఉండగా వారి ఇష్టారాజ్యంగా విధులకు ఆలస్యంగా హాజరవుతున్నారు. సాయంత్రం 5 గంటల వరకు విధులు నిర్వహించవలసి ఉండగా పలువురు కార్యదర్శులు సాయంత్రం నాలుగు గంటలకే సద్దుకుని ఇళ్లకు ప్రయాణం అవుతున్నారు. దీంతో ప్రజలకు కార్యదర్శులు అందుబాటులో ఉండడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు వారి పనిచేసే పంచాయతీ పరిధిలోనే నివాసం ఉండాలి. అయితే కార్యదర్శులు ఒకరిద్దరు తప్ప అంతా దూర ప్రాంతాల నుంచి విధులకు హాజరవుతున్నారు. కార్యదర్శులు ఆలస్యంగా విధులకు రావడంతో వివిధ పనులపై కార్యాలయానికి వచ్చే ప్రజలు వీరి రాక కోసం గంటలపాటు వేచి చూడాల్సిన దుస్థితి ఏర్పడుతుంది.



ఖాళీ కుర్చీతో దర్శనమిస్తున్న కార్యదర్శి గది

రెగ్యులర్ పంచాయతీ నుంచే విధులు నిర్వహణ..

పంచాయతీ కార్యదర్శులు కొందరు వారు పనిచేసే రెగ్యులర్ పంచాయతీ నుంచే ఇన్‌ఛార్జి పంచాయతీలకు కూడా విధులు నిర్వహిస్తున్నారు. ఇన్‌ఛార్జిగా ఉన్న పంచాయతీలకు వెళ్లడం లేదు. ముఖ్యమైన పని ఉంటే తప్ప ఇన్‌ఛార్జి పంచాయతీల మొహం కూడా చూడడం లేదని ప్రజలు చెప్పుకుంటున్నారు. కొందరు కార్యదర్శులు ఇన్‌ఛార్జిగా ఉన్న పంచాయతీల రికార్డులను కార్యదర్శి పనిచేసే రెగ్యులర్ పంచాయతీలో ఉంచి అక్కడికే సర్పంచిని, పంచాయతీ సిబ్బందిని పిలిపించుకుని పంచాయతీ కార్యకలాపాలు సాగిస్తున్నారు.

స్పందించని కార్యదర్శులు..

ప్రజా సమస్యలపై కార్యదర్శులకు ప్రజలు ఫోన్ చేస్తే ఏమాత్రం స్పందించడం లేదు. అదేవిధంగా ప్రతి కాప్రతినిధులు కూడా గ్రామ సమాచారం కోసం ఫోన్ చేసినా అందుబాటులోకి పలువురు కార్యదర్శులు రావడం లేదు. ఎప్పుడు ఏ కార్యదర్శి ఏ పంచాయతీలో విధులు నిర్వహించేది తెలియక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రజలు తికమక ..

పంచాయతీ కార్యదర్శులతో ప్రజలు నానా కష్టాలు పడుతున్నారు. కార్యదర్శి ఏ రోజు ఏ పంచాయతీలో ఉంటాడో తెలియడం లేదు. ఒక్కో కార్యదర్శికి రెండు నుంచి ఐదు పంచాయతీలు కేటాయించడంతో ఏ రోజు ఏ పంచాయతీలో కార్యదర్శి విధులు నిర్వహిస్తాడో తెలియని పరిస్థితితో ప్రజలు తికమక పడుతున్నారు. కొందరు పంచాయతీ కార్యదర్శులు తరచూ విధులకు డుమ్మా కొడుతున్నారు. ఈవిధంగా మండలంలో పంచాయతీ కార్యదర్శి సమయపాలన పాటించకపోవడంతో వివిధ పనులు, సమస్యలపై పంచాయతీ కార్యాలయాలకు వచ్చే ప్రజలు కార్యదర్శి రాక కోసం పడిగాపులు పడాల్సిన పరిస్థితులు దాపురించాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కార్యదర్శులు ఆడింది ఆట, పాడింది పాటగా తయారైందని మండల ప్రజలు చెప్పుకుంటున్నారు.

స్థానికంగా నివాసముండరు..

చిగురుకోట, చినకామనపూడి, దాకరం గ్రామాల కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరుకొల్లు నుంచి, గురజ



10 దాటినా తెరవని సచివాలయం

కార్యదర్శి పిడి శ్రీనివాస్ మచిలీపట్నం నుంచి, పెయ్యేరు, వాడవల్లి, వి.రావిగుంట, కోడూరు, పొద్దుగాక గ్రామాల కార్యదర్శి వై.శ్యాంసుందర్ మండలంలోని పెయ్యేరులో నివాసం ఉంటున్నారు. వడాలి, పెదకామనపూడి, వైవాక, వణుదుర్రు, ముదినేపల్లి గ్రామాల కార్యదర్శి జి.రమేష్ జొన్నపాడు నుంచి, శ్రీహరిపురం, పెదగొన్నూరు, బొమ్మినంపాడు, కాకరవాడ, కోమర్రు గ్రామాల కార్యదర్శి జె.గిరిజ పామర్రు నుంచి, చేవూరు, ములకలపల్లి, గ్రామాల కార్యదర్శి పివి.నాగలక్ష్మి గుడివాడ నుంచి, పెదపాలపర్రు కార్యదర్శి సహనాజ్ బేగం గుడివాడ నుంచి, కొరగంటపాలెం, ఈడేపల్లి, చిన పాలపర్రు, ఊటుకూరు, సంఘర్షణ పురం గ్రామాల కార్యదర్శి వి.ప్రభు కుమార్ ఉయ్యూరు నుంచి, సింగరాయపాలెం కార్యదర్శి సిహెచ్.సత్యవాణి గుడివాడ నుంచి, పేరూరు కార్యదర్శి ఎం.సాయి ప్రదీప్ మండవల్లి నుంచి, దేవపూడి కార్యదర్శి మనోజ్ కుమార్ మండలంలోని వాడవల్లి నుంచి, అల్లూరు కార్యదర్శి కిరణ్ కుమార్ గుడివాడ నుంచి, పెనుమల్లి కార్యదర్శి బివి.శ్రీనివాసరావు మండవల్లి మండలం కానుకొల్లు నుంచి వస్తూ మండలంలో విధులు నిర్వహిస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి రావడంతో విధులకు సకాలంలో హాజరు కావడం లేదనే ఆరోపణలు మండలంలో ప్రజల నుంచి వినబడుతున్నాయి. స్థానికంగా నివాసముండే వారినే నియమించి, అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ప్రజలు వేడుకుంటున్నారు.

9న సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి – ఏలూరు

ఈనెల 9వ తేదీన ఉగాది సందర్భంగా రాజ్యాంగ శ్రవణం, సామాజిక పంచాంగ శ్రవణం, కవి, గాయక, నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు తెలిపారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్, బహుజన ఆఫీసర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఉగాది వేడుకకు అందరూ ఆహ్వానితులే అని నిర్వాహకులు కోరారు. కార్యక్రమం బ్రౌచర్స్‌ను అన్నే భవనంలో భారత్ బచావో జిల్లా కమిటీ, వైఎంహెచ్ఎ హాల్‌లో ఘంటసాల స్వరపీఠం కమిటీ, నిర్వాహక కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గుడిపాటి నరసింహారావు, దేవరకొండ వెంకటేశ్వర్లు, ఆలపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 9వ తేదీ సాయంత్రం 4 గంటలకు యుటిఎఫ్ జిల్లా ఆఫీస్‌లో జరిగే వేడుకకు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎస్‌కె.ముస్తఫ ఆలీ అధ్యక్షత వహిస్తారన్నారు. రెండు చోట్లా జరిగిన ఆవిష్కరణ కార్యక్రమంలో ఎల్.వెంకటేశ్వర్లు, ఎం.కోటేశ్వర రావు, ఆలపాటి నాగేశ్వరరావు, దేవరకొండ వెంకటేశ్వర్లు, గుడిపాటి నరసింహారావు, పివి.నరసింహారావు పాల్గొన్నారు.

విద్యుత్ మోటార్లపై స్టిక్కర్లు తొలగింపు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి – ముసునూరు

విద్యుత్ మోటార్లకు మీటర్ల బిగించడం.. రైతులకు ఉరితాళ్లు బిగించినట్లు అని ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఆదివారం ముసునూరు మండలం రమణక్క పేటలో వ్యవసాయ విద్యుత్ మీటర్లపై ముఖ్యమంత్రి చిత్రంతో నవరత్నాల లోగోలు అతికించబడి ఉన్నాయని వచ్చిన ఫిర్యాదుపై నూజివీడు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వై.భవాని శంకరి స్పందిస్తూ ప్రస్తుతం రమణక్కపేట గ్రామ పరిధిలో వ్యవసాయ విద్యుత్ మీటర్లపై స్టికర్‌లను తొలగించడం జరిగిందని ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా ఏమైనా స్టికర్‌లు ఉంటే విద్యుత్ శాఖ ఎఇలను తొలగించాలని ఆదేశించారు.

తనిఖీ కేంద్రాల వద్ద పటిష్ట నిఘా

రిటర్నింగ్ అధికారి ఎమ్.సూర్యతేజ

ప్రజాశక్తి – జీలుగుమిల్లి

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన ఎన్నికల తనిఖీ కేంద్రాల వద్ద పటిష్ట నిఘా ఏర్పాటు చేసినట్లు పోలవరం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి ఎమ్.సూర్యతేజ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని తాటియకులగూడెం ఆంధ్ర, తెలంగాణ సరిహద్దు వద్ద ఏర్పాటు చేసిన తనిఖీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాహన తనిఖీల తీరుపై చెక్‌పోస్ట్ ఇన్‌ఛార్జి నిఖిల్ మధు శరణ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరిహద్దు గుండా నగదు, అక్రమ మద్యం, తరలిపోకుండా పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని సిబ్బందికి ఆదేశించారు. ఎన్నికల సమయం సమీపిస్తున్న దృష్ట్యా 24 గంటల పాటు సిబ్బంది విధులలో వుండి ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తనిఖీ కేంద్ర ఇన్‌ఛార్జి టి.నిఖిల్ మధు శరణ్, చెక్ పోస్ట్ టీమ్ సభ్యులు ఎఎస్ఐ కె.సోమరాజు, సెక్రెటరీ సతీష్ ఉన్నారు.

'అంబేద్కర్ విగ్రహ పున: ప్రతిష్టకు రంగం సిద్ధం'

మండవల్లి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహ పున: ప్రతిష్టను వీనుల విందుగా.. కనుల పండుగగా నిర్వహించేందుకు పూర్తిస్థాయిలో రంగం సిద్ధం చేశామని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అసోసియేషన్ కమిటీ ఉపాధ్యక్షులు కె.శాంతరాజు, ఎల్ఎస్.భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. పున: ప్రతిష్టకు నిర్వహిస్తున్న పనులను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ రహదారి అభివృద్ధి పనులలో భాగంగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించాల్సి వచ్చిందని అన్నారు. తిరిగి విగ్రహాన్ని బస్టాండ్ పక్కన ఏర్పాటుచేసి సోమవారం సాయంత్రం 4 గంటలకు పున: ప్రతిష్ట నిర్వహిస్తున్నామని అన్నారు. సర్పంచి మెండ ఝాన్సీ అధ్యక్షతన నిర్వహించే ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ దుంగా రత్న ప్రదీప్, పివి.రావు మాల మహానాడు జాతీయ అధ్యక్షులు పండు అశోక్ కుమార్‌లు పాల్గొని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు.

వైసిపి అభ్యర్థులను గెలిపించాలి : స్వాతి

ముదినేపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు కోడలు దూలం స్వాతి అన్నారు. ఆదివారం మండలంలోని చేవూరు గ్రామంలో వైసీపీ శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి వైసిపి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న దూలం నాగేశ్వరరావు, కారుమూరి సునీల్ కుమార్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు.

ఎంసిఎంసి అనుమతి తప్పనిసరి : కలెక్టర్

ప్రజాశక్తి – ఏలూరు

ఎన్నికల ప్రవర్తనా నియమావళికి ఎటువంటి ఉల్లంఘనలు జరగకుండా ఎన్నికల రాజకీయ ప్రకటనల ప్రసారం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ స్పష్టం చేశారు. త్వరలో జరగనున్న 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాకి సంబంధించి వివిధ రకాల టీవీ ఛానల్స్‌లో ప్రసారం అయ్యే రాజకీయ ప్రకటనల నిమిత్తం ముందస్తుగా మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసిఎంసి) ఆమోదం పొందాలన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో పాల్గొనే అభ్యర్థుల రాజకీయ ప్రకటనలు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రచార ప్రకటనలు పరిశీలించేందుకు జిల్లా స్థాయిలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీని నియమించడం జరిగిందన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు సంబంధించి ఎంసిఎంసి ఆమోదం పొందిన రాజకీయ ప్రకటనలను మాత్రమే ప్రసారం చేయాలన్నారు. ప్రకటనలలో ఇతరులను కించపరిచే అంశాలు, సమాజంలోని వివిధ వర్గాల ప్రజలు, కుల, మతపరమైన విమర్శలు, విద్వేషాలను రగిల్చే, దేశ సార్వభౌమాధికారానికి భంగం కలిగించే అంశాలు ఉండకూడదన్నారు. అనుమతించిన ప్రసార అంశాలు కాకుండా వాటికి అదనంగా వేరే అంశాలు జతచేసి ప్రసారం చేయకూడదన్నారు. ప్రకటన అనుమతి కోసం అభ్యర్థి దరఖాస్తు చేసే సమయంలో రిజిస్టర్డ్ పార్టీలైతే ప్రసార అంశాలను ప్రసార తేదీకి కనీసం మూడు రోజులు ముందుగా, అన్ రిజిస్టర్డ్ పార్టీలైతే వారం రోజుల ముందు ఎంసిఎంసి వారికి అనుమతి నిమిత్తం అందజేయాలన్నారు. అదేవిధంగా ఎన్నికల ప్రచారానికి సంబంధించి ముద్రించే కరపత్రాలకు సంబంధించి ముద్రించే వివరాలను ఎంసిఎంసి కమిటీకి తెలియజేసి తగు ఆమోదం పొందాలన్నారు. ముద్రించిన కర పత్రాలపై తప్పనిసరిగా ప్రింటింగ్ ప్రెస్ పేరు, ప్రతుల సంఖ్య ముద్రించి యుండాలని, లేనిఎడల అటువంటి వాటిని గుర్తించి సంబంధిత ప్రింటర్స్‌కు నోటీసులు జారీ చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు.

రెగ్యులరైజేషన్‌లో అవకతవకలపై కలెక్టర్ విచారించాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి ప్రసాద్

ఏలూరు అర్బన్: వైద్య ఆరోగ్య శాఖలో ఎంపిహెచ్ఎ(మేల్) కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ ప్రక్రియలో జరిగిన అవకతవకలపై జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరిపించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి ప్రసాద్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రెగ్యులరైజేషన్ ప్రక్రియలో జిల్లా అధికారులు నిబంధనలకు విరుద్ధంగా, అడ్డగోలుగా అర్హత లేనివారిని రెగ్యులర్ చేసినట్లుగా వార్తలు వస్తున్నాయని, తక్షణమే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేసేందుకు జిఓ నెంబర్ 114 ద్వారా 2014 జూన్ 2కి ముందు విధుల్లో చేరిన వారిని క్రమబద్ధీకరించాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. కానీ జిల్లాలో 2014 జూన్ రెండు తర్వాత విధుల్లో చేరిన కొంతమందిని రెగ్యులర్ చేశారని, ఇది నిబంధనలకు విరుద్ధమని అన్నారు. అర్హత లేని మరి కొందరిని రెగ్యులర్ చేసేందుకు జాబితా సిద్ధం చేస్తున్నారనే ఆరోపణలు కూడా వస్తున్నాయని విమర్శించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ ఉత్తర్వులను తుంగలో తొక్కి ఏ రకంగా రెగ్యులర్ చేస్తారని ప్రశ్నించారు. ఈ అంశంలో పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారినట్లు వార్తలు వస్తున్నాయని, పైరవీలు చేసుకొని రెగ్యులరైజ్ అయ్యారనే ప్రచారం జరుగుతుందని తెలిపారు. రెగ్యులర్ అయిన వారి లిస్టులు బయటకు ప్రకటించకుండా గోప్యంగా ఉంచడం పట్ల సందేహాలు వస్తున్నాయని అన్నారు. తక్షణమే ఈ అంశంపై జోక్యం చేసుకొని సమగ్ర విచారణ జరిపించాలని అన్నారు.

నిరుపేద కుటుంబాలకు 'మానవత' సాయం

భీమడోలు: స్వచ్ఛంద సేవా సంస్థ మానవత భీమడోలు శాఖ ఆధ్వర్యంలో రానున్న కాలంలో మరిన్ని సంక్షేమ, సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్టు శాఖ అధ్యక్షులు వట్టి సుగుణాకర్ తెలిపారు. శాఖ ఆధ్వర్యంలో ఆదివారం పూళ్ళ గ్రామపంచాయతీ పరిధిలో కొన్ని కార్యక్రమాలను శాఖ అధ్యక్షుని ఆధ్వర్యంలో చేపట్టారు. దీనిలో భాగంగా ఎంఎం.పురం ఆవాస ప్రాంతంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నాలుగు నిరుపేద కుటుంబాలకు నిత్యావసర వస్తువులు, బియ్యం, ఇతరాలను అందజేశారు. భీమడోలుకి చెందిన సాయిరాం క్లాత్ స్టోర్స్ సౌజన్యంతో ఆ కుటుంబాల వారికి దుస్తులను సమకూర్చారు. ఇదేవిధంగా చికిత్స నిమిత్తం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఒక వ్యక్తికి వైద్యం కోసం రూ.5 వేల నగదును ఇచ్చారు. అనంతరం భీమడోలులో శాఖ కార్యాలయ భవన నిర్మాణానికి విరాళాలు ఇచ్చిన గ్రామానికి చెందిన పుప్పాల రామ్మోహన్‌రావు, పుప్పాల వెంకటరామయ్య(బుజ్జీలు)లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో శాఖ ఉపాధ్యక్షులు గుడివాడ సీతారామాంజనేయులు, కార్యదర్శి అడబాల శ్రీనివాసరావుతో పాటు పలువురు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరవాలి

రైతు సంఘం నాయకులు డిమాండ్

ప్రజాశక్తి – ఏలూరు అర్బన్

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే తెరవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నర్సింహ, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రబీ వరి కోతలు ప్రారంభమై 15 రోజులు కావస్తున్నా ఇంతవరకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడం దారుణమని విమర్శించారు. అయినంతవరకూ దళారులకు అమ్ముకుని అన్నదాతలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 75 కేజీల ధాన్యం బస్తాకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ఏ గ్రేడ్‌కు రూ.1652, సాధారణ రకానికి రూ.1637 కాగా ప్రస్తుతం రూ.1250లకే దళారులు కొనుగోలు చేస్తున్నారని, ఫలితంగా బస్తాకు రూ.400 వరకు రైతులు నష్టపోతున్నారని చెప్పారు. కొన్ని ప్రాంతాలలో 50 శాతం పైగా వరి కోతలు పూర్తి కావస్తున్నా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాలలో కొన్నిచోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరిచారని, ఏలూరు జిల్లాలో ఒక్క కొనుగోలు కేంద్రం కూడా తెరవకపోవడం వల్ల రైతులు నష్టపోవాల్సి వస్తుందని చెప్పారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరచి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులను సమీకరించి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు

టి.నరసాపురం : ఎండల తీవ్రత వల్ల ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు, ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు బొర్రంపాలెం గ్రామ పెద్దలు బొమ్మగాని బాలకృష్ణ అన్నారు. మండలంలోని బొర్రంపాలెంలో బొమ్మగాని బాలకృష్ణ సహకారంతో యువకులు ఆదివారం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రంను ప్రారంభించిన బాలకృష్ణ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం గ్రామంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని, వృద్ధులకు, ప్రయాణికులకు ఎండల తీవ్రత దృష్ట్యా దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి గ్రామంలో ఇలాంటి చలివేంద్రాలని ఏర్పాటు చేసి ప్రయాణికులకు దాహార్తిని తీర్చే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం దిగ్విజయంగా నడిపిస్తున్న యూత్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కలపర్తి విజయ్ పాల్గొన్నారు.

మణికంఠ కుటుంబానికి సాయం

ఏలూరు స్పోర్ట్స్: మృతి చెందిన జర్నలిస్టు కుటుంబానికి సహృదయంతో ఏలూరు నగరంలోని జర్నలిస్టులే కాకుండా జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన జర్నలిస్టులు ఆర్థిక సహాయం అందించి వారి కుటుంబానికి, మిగిలిన జర్నలిస్టులకు ఆదర్శంగా నిలిచారు. సంబంధిత వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు నగరానికి చెందిన శ్రవణం మణికంఠ(36) అనారోగ్య కారణాలతో ఇటీవల కాలంలో మృతి చెందాడు. ఆయన ఆంధ్రప్రభలో దాదాపు పది సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. ఈక్రమంలో ఆదివారం ఆయన పెద్దకర్మ నిర్వహించారు. ఈ సమయంలో నిరుపేద కుటుంబానికి చెందిన మణికంఠ కుటుంబాన్ని ఆదుకునేందుకు ఏలూరు నగరంలోని జర్నలిస్టులే కాకుండా జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన జర్నలిస్టులు ముందుకు కదిలారు. 64 మంది జర్నలిస్టులు తమ వంతు సాయంగా రూ.60 వేలును మణికంఠ సతీమణికి అందించారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి – ఉంగుటూరు

ఉంగుటూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 8వ తేదీన నిర్వహిస్తామని ఎంపిపి గంటా శ్రీలక్ష్మి వెల్లడించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న కారణంగా ప్రభుత్వ శాఖలపై సమీక్షలు, కొత్త పనులకు ఆమోదం, హామీలు ఇవ్వడం తదితర అంశాలు ఏమీ ఉండవని, ప్రతి మూడు నెలలకు ఒకసారి సర్వసభ్య సమావేశం నిర్వహించాలి కాబట్టి ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అయితే అత్యవసర అంశాలైన తాగునీటి సమస్యలపై చర్చించే అవకాశం ఉందన్నారు.

'ప్రతిఒక్కరూ పార్థసారధి గెలుపునకు కృషి చేయాలి'

ప్రజాశక్తి – ముసునూరు

ప్రతిఒక్కరూ టిడిపి పట్ల విధేయతతో పనిచేసి, టిడిపి, జనసేన అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని టిడిపి నూజివీడు నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థి కొలుసు పార్థసారధి తనయుడు నితిన్ కృష్ణ అన్నారు. మండలంలోని కోర్లగుంట గ్రామంలో నితిన్ కృష్ణ ఆదివారం ముసునూరు మండల తెలుగు యువతతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్థసారధి గెలుపునకు కృషి చేయాలని యువతతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు యువత నాయకులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వైసిపిలోకి పలువురు

ప్రజాశక్తి – ఏలూరు టౌన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సమక్షంలో దెందులూరు ఎంఎల్ఎ కొఠారు అబ్బయ్య చౌదరి, ఏలూరు వైసిపి ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ ఆధ్వర్యంలో పలు పార్టీలకు చెందిన నేతలు వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. నియోజకవర్గంలోని టిడిపికి చెందిన రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షులు చలుమోలు అశోక్ గౌడ్, పిసిసి జనరల్ సెక్రెటరీ, దెందులూరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జిగా పనిచేసిన డివిఆర్‌కె చౌదరి, బిజెపి పెదవేగి మండల అధ్యక్షులు శంకర్ గౌడ్, మాజీ పెదవేగి సొసైటీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు మేడికొండ శ్రీనివాస్, జిల్లా డిసిసి సెక్రెటరీ చలసాని కిరణ్, పెదవేగి మండల టిడిపి సీనియర్ నాయకులు పాలడుగు భాను ప్రకాష్, జిల్లా గౌడ సంఘం యూత్ ప్రెసిడెంట్ ప్రసాద్, తదితర కీలక నేతలు వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా జగన్ మోహన్ రెడ్డి అందరికీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో దెందులూరు నియోజకవర్గ పరిశీలకులు, టిటిడి బోర్డు మెంబర్ నెరుసు నాగసత్యం పాల్గొన్నారు.

'కాపులు ఐకమత్యంగా ఉండాలి'

ప్రజాశక్తి – ఏలూరు టౌన్

కాపులు ఐకమత్యంగా ఉంటే అన్నీ మీ వద్దకే వస్తాయని కాపు సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు పులి శ్రీరాములు అన్నారు. కాపుల ఆత్మీయ సమావేశం శనివారపు పేట వాసా వారి వీధిలో ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన పులి శ్రీరాములు మాట్లాడుతూ సాటి కాపుల పట్ల ఈర్ష్య, ద్వేషం, అసూయ వదిలేయాలని, రాష్ట్రంలో ఉన్న కోటీ 42 లక్షల మంది అందరూ ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ, పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఇంజనీరు మోటేపల్లి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

టిడిపిలో బలహీన వర్గాలకు తీరని అన్యాయం

స్వతంత్ర అభ్యర్థి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి – ముసునూరు

బలహీన వర్గాలకు టిడిపిలో తీరని అన్యాయం జరుగుతోందని అందుకు ఉదాహరణ 10 సంవత్సరాల పాటు నూజివీడు నియోజకవర్గంలో కష్టపడి పార్టీని బలోపేతం చేసిన తనకు టికెట్‌ను చంద్రబాబు నిరాకరించడమే అని మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం చాట్రాయి మండలంలో ముద్దరబోయిన అభిమానుల ఆధ్వర్యంలో తుమ్మగూడెం గ్రామాలలో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబ్బే ప్రధానంగా రాజకీయాలు మారాయని, గత రెండు సందర్భాలలో నూజివీడు నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేస్తూ ప్రతి ఇంటికి ముద్దరబోయిన వెళ్లాడన్నారు. తాను స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నానన్నారు. ప్రతి కార్యకర్త అండగా నిలిచి ఓట్లు వేయించగలిగితే నియోజకవర్గంలో ధన ప్రవాహాన్ని ఎదుర్కొని ముద్దరబోయిన గెలవడం ఖాయం అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామాల ప్రజలు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

గ్రూపు విభేదాలు లేకుండా పనిచేయాలి

వైసిపి జిల్లా అధ్యక్షులు ఆళ్లనాని

ప్రజాశక్తి – కామవరపుకోట

ఎటువంటి వర్గ విభేదాలు లేకుండా మండలంలోని ప్రతి గడపకూ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి చేసిన సంక్షేమ కార్యక్రమాలు వివరించాలని, పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని వైసిపి జిల్లా అధ్యక్షులు, ఏలూరు ఎంఎల్ఎ ఆళ్లనాని తెలిపారు. ఏలూరులోని ఆయన క్యాంప్ ఆఫీసులో మండలానికి చెందిన జిల్లా ఎస్‌సి, ఎస్‌టి కేసుల విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు గుర్రాల రవికుమార్, ఎపి క్రిష్టియన్ మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ పండు జగదీష్, జిల్లా వైసిపి జాయింట్ సెక్రెటరీ వెర్రి శ్రీను, కామవరపు కోట పార్టీ టౌన్ ప్రెసిడెంట్ నానాది సాగర్ కలిశారు. చింతలపూడి నియోజకవర్గం కామవరపుకోట మండలంలో పార్టీలో జరుగుతున్న పరిస్థితులను గురించి వివరించారు. పార్టీలో తాము ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి ఆళ్ల నానికి తెలిపారు. ఈ సందర్భంగా కలిసిన నాయకులతో ఆళ్ల నాని మాట్లాడుతూ పార్టీ గెలుపుకు ప్రతిఒక్కరూ కలిసి పనిచేయాలని సూచించారు.